సాక్షి
కుమురం భీం

ఆదివారం । 31 । డిసెంబర్ । 2023



అభివృద్ధికి దూరంగా 'లోహా'

ప్రభుత్వాలు మారుతున్నా గిరిజనుల తల రాతలు మాత్రం మారడంలేదు. అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న లోహాలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. 9లో▸

20న అవిశ్వాస సమావేశం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసం తీర్మానం పెట్టేందుకు సమావేశం ఏర్పాటు చేయాలని ఇటీవల మున్సిపల్ మెజారిటీ కౌన్సిలర్లు డీఆర్‌వో సురేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ నేపథ్యంలో జనవరి 20న అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు శనివారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

గరిష్టం/కనిష్టం
27.4 /15.6

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా తక్కువగా నమోదవుతాయి. రాత్రి చలి ప్రభావం కాస్త తగ్గుతుంది. వేకువజామున పొగ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి



సురేశ్‌కుమార్, ఎస్పీ

ఆసిఫాబాద్: జిల్లా ప్రజలు నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని, శృతి మించితే కఠినచర్యలు తప్పవని ఎస్పీ సురేశ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు శాఖ ముందస్తు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. డిసెంబర్ 31 రాత్రి నిర్వహించుకునే వేడుకల సందర్భంగా జిల్లా పరిధిలోని స్థానిక పోలీసులతో పాటు ట్రాఫిక్, టాస్క్‌ఫోర్స్, షీటీమ్స్‌తో పాటు పెట్రోలింగ్ విభాగాలకు చెందిన పోలీసులు ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహిస్తారన్నారు. రాత్రి 12 గంటల లోపు వేడుకలు ముగించాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలిగించే విధంగా సామాన్య ప్రజలకు ఎవరైనా ఇబ్బందులు కలిగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. యువకులు మద్యం సేవించి, నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడితే జరిమానాతో పాటు జైలుశిక్ష విధించబడుతుందని హెచ్చరించారు. రోడ్లపై వెళ్లేవారిని ఇబ్బందికి గురి చేసే విధంగా వ్యవహరిస్తే సదరు వాహనదారులకు చట్టపరమైన ఇబ్బందులు తప్పవన్నారు. రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ట్రాఫిక్ సిబ్బందితో పాటు స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లోనూ ముమ్మరంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామన్నారు.

'సదరం శిబిరాలు నిర్వహించాలి'

ఆసిఫాబాద్: జిల్లాలో సదరం శిబిరాలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినకర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కొన్ని నెలలుగా సదరం శిబిరాలు నిర్వహించక పోవడంతో దివ్యాంగులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన సంక్షేమ పథకాలకు సదరం సర్టిఫికెట్లు అడుగుతున్నారని, సర్టిఫికెట్లు లేనివారు నష్టపోతారన్నారు.

కలిసిరాని కాలం

- సకాలంలో కురవని వర్షాలు
- సహకరించని వాతావరణం
- అంచనాలు దాటని పరిహారం
- దిగుబడి తగ్గి గిట్టుబాటులేక..
- జిల్లాలో నష్టాల బాటలో రైతులు

అన్నం పెట్టే రైతుకు కాలం కలిసి రాలేదు. ప్రకృతి వైపరీత్యాలు..అతివృష్టి..అనావృష్టి ఏటా ఇబ్బందులకు గురిచేస్తున్నా.. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని పంటలు పండిస్తున్నా.. కలిసిరాని కాలంతో దిగుబడులు లేక... ధరలు రాక రైతులకు మాత్రం ఈ ఏడాది నష్టాలనే మిగిల్చింది.



కౌటాల మండలంలో సాగు చేస్తున్న మిరప పంట

చింతలమానెపల్లి(సిర్పూర్): జిల్లాలో ప్రధాన జీవనాధారం వ్యవసాయం. ఈఏడాది జిల్లాలో ప్రధానంగా వరి, పత్తి, మిరప, సోయా, కంది పంటలు సాగు చేశారు. అంతర పంటలుగా తృణ ధాన్యాలు, కూరగాయాలు సాగు చేశారు. గతేడాది పత్తి సాగు చేసిన రైతులకు పంటను విక్రయించడానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గతేడాది 700 ఎకరాల్లో మిర్చి సాగు చేయగా ఈ ఏడాది 1,065 మంది రైతులు 1,893 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. కాగజ్‌నగర్ డివిజన్‌లో అత్యధికంగా 1,840 ఎకరాల్లో, ఆసిఫాబాద్ డివిజన్‌లో 53 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. గతంలో అంతరపంటగా కంది సాగు చేయగా అత్యధికంగా ధర పలుకుతుండడంతో ప్రధాన పంటగా సాగు చేసే రైతుల సంఖ్య పెరిగింది. గతంతో పోల్చుకుంటే ఈఏడాది కంది సాగు విస్తీర్ణం పెరిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు. సాధారణ పంటలతో పాటు జిల్లాలో కాగజ్‌నగర్ మండలం ఈస్‌గాం, కౌటాల మండలం రవీంద్రనగర్, ఆసిఫాబాద్ డివిజన్‌లోని పలు మండలాల్లో వ్యాపార అవసరాలకు కూరగాయలు పండిస్తున్నారు.

పంట నష్టం..అందని పరిహారం

రైతులకు గత ప్రభుత్వం పెట్టుబడి సాయంగా రైతుబంధు పథకం కింద ఎకరాకు రూ.5వేలు అందిస్తోంది. కాగా ఈ పెట్టుబడితో వ్యవసాయ పనులు ప్రారంభించిన రైతులు వాతావరణం సహకరించక నష్టపోయారు. ఖరీఫ్‌లో ఆలస్యంగా కురిసిన వర్షాలతో విత్తనాలు నష్టపోగా తిరిగి నాటుకున్న రైతులకు అతివృష్టి నష్టం కలిగించింది. జిల్లా వ్యాప్తంగా ఏటా పెన్‌గంగ, ప్రాణహిత, పెద్దవాగు, ఇతర వాగుల వరదలతో నష్టం వాటిల్లుతోంది. ఈఏడాది నదుల పరీవాహక ప్రాంతాల్లోని పెంచికల్‌పేట్, చింతలమానెపల్లి, బెజ్జూర్, సిర్పూర్(టి), కౌటాల, దహెగాం, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, వాంకిడి మండలాల్లో వేలాది ఎకరాల్లో పంటలు నష్టపోయారు. అధికారులు పలుమార్లు సర్వేలు నిర్వహించి నష్టం అంచనాల నివేదికలను ప్రభుత్వానికి అందించారు. కానీ ఈసర్వేలు అంచనాలకే పరిమితమయ్యాయి. ప్రభుత్వం ఎలాంటి నష్ట పరిహారం అందించలేదు.

తెగుళ్ల బెడద

ఈఏడాది పంటలకు తెగుళ్ల బెడద తక్కువగా ఉంది. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో పురుగులు ఆశించినా వరి, పత్తి పంటలకు ఎక్కువగా నష్టం వాటిల్లలేదు. కానీ గణనీయంగా పెరిగిన సాగుతో ఆశలు పెంచుకున్న మిరప పంటకు మాత్రం తెగుళ్ల బెడద తప్పలేదు. గుర్తు పట్టని వైరస్, పురుగులతో మిరప మొక్కలు ఎండి పోయాయి.

ఖరీఫ్.. వర్షాలు ఆలస్యం

ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు ఆలస్యంగా కురవడంతో రైతులు విత్తనాలు ఆలస్యంగా నాటుకున్నారు. ఆరంభంలో కురిసిన వర్షాలు తిరిగి సుమారు 15 రోజుల పాటు నిలిచిపోవడంతో నాటిన పత్తి విత్తనాలు భూమిలోనే పగిలి పోయాయి. దీంతో రెండోసారి విత్తనాలు నాటుకోవాల్సి వచ్చింది. కూలీలు, విత్తనాలు, ఎరువులు, మందులు ఇలా రైతులకు అదనపు వ్యయం భరించాల్సి వచ్చింది. దీనికి తోడు నకిలీ విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు విత్తనాలు మొలకెత్తక పోవడంతో తీవ్రంగా నష్టపోయారు. వరి, కంది, ఇతర పంటల సాగు సైతం ఆలస్యంగా ప్రారంభమైంది.



వర్షాలు కురవక భూమిలో పగిలిపోయిన పత్తి విత్తనాలు

పెరిగిన ధరలు

పంటల దిగుబడి తగ్గడం సామాన్యుడికి భారంగా మారింది. జిల్లా వ్యాప్తంగా కూరగాయల సాగుపై పడ్డ ప్రభావం మార్కెట్‌లో కొనుగోలు చేసే సామాన్యుడిపై పడింది. జిల్లాలో టమాటా, ఉల్లిగడ్డ, ఇతర కూరగాయల సాగులో పంట రాక పోవడంతో ధరలు ఆకాశాన్నంటాయి. టమాటా, ఉల్లిగడ్డ లాంటి కూరగాయాలు ఎన్నడూలేని ధర పలికాయి. టమాటా కిలో రూ.150, ఉల్లిగడ్డ రూ.100 దాటింది.



చింతలమానెపల్లి మండలంలో వరిగడ్డ పేరుస్తున్న రైతులు

దిగుబడి తగ్గి ..భరోసా లేక..

వాతావరణం అనుకూలించని పరిస్థితిలో పంటల దిగుబడి గణనీయంగా తగ్గింది. ప్రధాన పంటలైన వరి, పత్తి రైతులు మద్దతు ధర లేక తీవ్రంగా నష్టపోయారు. పంటలు చేతికందే దశలో వర్షాలు మొహం చాటేయండంతో దిగుబడి గణనీయంగా తగ్గింది. జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్లలో రైతులు మద్దతు ధర పెంచాలని డిమాండ్ చేసినా ఫలితం లేకుండా పోయింది. పత్తి సాగుకు ఎకరాకు రూ.40 వేల వరకు ఖర్చవుతుండగా దిగుబడి 5 క్వింటాళ్ల వరకు మాత్రమే వస్తోంది. మద్దతు ధర క్వింటాకు రూ.7 వేలు పలుకుతుండడంతో రూ.35 వేలు మాత్రమే వస్తున్నాయి. వరి సాగుకు ఎకరాకు రూ.33 వేల వరకు ఖర్చవుతుండగా 15 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తోంది. క్వింటాలుకు మద్దతు ధర రూ.2,200తో రూ.33వేలు గిట్టుబాటవుతోంది. సాగు చేసిన పంటలకు ఖర్చు కన్నా మద్దతు ధర తక్కువగా వస్తుండడంతో రైతులకు దిగుబడి తగ్గి మద్దతు ధర లేక వ్యవసాయం భరోసా లేకుండా పోయింది. జీవనాధారం అయిన వ్యవసాయం ఈ ఏడాది నష్టాలనే మిగులుస్తోంది.

వానాకాలం, యాసంగి పంటల సాగు వివరాలు

వానాకాలం

పంట	ఎకరాలు
పత్తి	3,50,000
వరి	57,306
కంది	42,000
మిర్చి	1,893
సోయా	1,524

యాసంగి

పంట	ఎకరాలు
వరి	18,000
మొక్కజొన్న	838
జొన్న	6,108
శనగ	4,401
గోధుమ	1,028
పెసర	135
కూరగాయలు	641
మిర్చి	146

దరఖాస్తుల స్వీకరణలో ఇబ్బందులుండొద్దు

- ఉమ్మడి జిల్లా ప్రజాపాలన ప్రత్యేకాధికారి ఎం.ప్రశాంతి



మోడిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ప్రశాంతి

ఆసిఫాబాద్: రాష్ట ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో 6 గ్యారంటీల పథకాల కొరకు దరఖాస్తులు సమర్పించే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజాపాలన ప్రత్యేకాధికారి ఎం.ప్రశాంతి అన్నారు. జిల్లా కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం, ఆసిఫాబాద్ మండలం అడ గ్రామ పంచాయతీల్లో కొనసాగుతున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని కలెక్టర్ హేమంత్ బోర్కడే, అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమంలో 6 గ్యారంటీల ఫలాలను అందించేందుకు గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల వారీగా దరఖాస్తులు స్వీకరించాలని, జనవరి 2024 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. దరఖాస్తు దారులు ముందస్తుగానే తమ దరఖాస్తును పూర్తిచేసి కౌంటర్లలో అందించాలన్నారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. కలెక్టర్ హేమంత్ బోర్కడే మాట్లాడుతూ దరఖాస్తుల స్వీకరణకు 1,355 కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీపీవో ఉమర్ హుస్సేన్, ఎంపీడీవో మహేందర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతీ కుటుంబం దరఖాస్తు చేసుకోవాలి

కెరమెరి(ఆసిఫాబాద్): ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఆరు గ్యారంటీ పథకాలకోసం ప్రతీ కుటుంబం దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి జిల్లా ప్రజాపాలన నోడల్ అధికారి ఎం ప్రశాంతి అన్నారు. శనివారం మండలంలోని మోడిలో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ దుర్పతబాయి, అడిషనల్ డీఆర్‌డీవో శ్రీనివాస్, జిల్లా వైద్యాధికారి తుకారాం భట్, ఏవో గోపీకాంత్, రేంజర్ మరుఖొద్దీన్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, సర్పంచ్ న్యానేశ్వర్, సుమన్‌బాయి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మునీర్ అహ్మద్,తదితరులు పాల్గొన్నారు.



ఆశ..నిరాశల మేళవింపు

- ఉత్పత్తిలో దూకుడు...
- కొత్త గనుల ఏర్పాటులో జాప్యం
- రెట్టింపు స్థాయిలో బొగ్గు రవాణా
- ఏరియాలో కంపెనీ లెవల్ సాంస్కృతిక పోటీలు



రెట్టింపు స్థాయిలో బొగ్గు రవాణా చేస్తున్న గోలేటి సీహెచ్‌పీ

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాకు ఈ సంవత్సరం ఉత్పత్తి పరంగా ఆశాజనంగా, కొత్త గనుల ఏర్పాటు నిరాశ జనకంగా సాగింది. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది పెరిగిన ఔట్‌పుట్, తక్కువ కురిసిన వర్షాలు, పెరిగిన రక్షణ.. ఇలా బెల్లంపల్లి ఏరియాకు 2023 సంవత్సరం అంతా కలిసి వచ్చినట్టే కనిపిస్తోంది. ఒకప్పుడూ ఉత్పత్తిలో ఓ వెలుగు వెలిగిన బెల్లంపల్లి ఏరియా కొన్నేళ్లుగా వార్షిక లక్ష్యసాధనలో తడపడుతూ వస్తోంది.

కైరిగూడ పైనే ఉత్పత్తి భారమంతా..

ఐదేళ్ల క్రితం బెల్లంపల్లి ఏరియా ఉత్పత్తిలో సింగరేణిలోనే మొదటి స్థానంలో ఉండేది. కాలక్రమేణా ఒక్కో ఓసీపీ మూతపడుతూ వచ్చాయి. ప్రస్తుతం బెల్లంపల్లి ఏరియాలో ఒక్క కైరిగూడ ఓసీపీలో మాత్రమే ఉత్పత్తి కొనసాగుతోంది. దాంతో ఏరియా ఉత్పత్తి భారమంతా కైరిగూడ ఓసీపీ ఒక్కటే మోయాల్సి వస్తోంది. బీపీఏ వార్షిక లక్ష్యం 37 లక్షల టన్నులు కాగా ఇప్పటికే 28 లక్షల ఉత్పత్తిని సాధించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ 31 నాటికి బీపీఏ లక్ష్యం 21,64,423 టన్నులు కాగా ఇప్పటికే 28,27,575 టన్నులు సాధించింది. కొన్నేళ్లుగా ఏరియా ఉత్పత్తి సాధనలో వెనకబడి పోగా ఈసారి ఉత్పత్తి సాధనకు అనేక అంశాలు కలిసివచ్చాయి. ఈ సంవత్సరం వర్షాకాలంలో తక్కువ వర్షాలు కురియడంతో ఓసీపీలో ఉత్పత్తి ప్రక్రియకు పెద్దగా ఆటంకం లేకుండా పోయింది. మరోవైపు ఓసీపీలో కొంతభాగం సింగరేణి కార్మికుల చేతనే ఓబీ వెలికితీయించటంతో కోల్‌బెంచ్‌ల కోసం ఓబీ కాంట్రాక్టర్‌పై ఆధారపడాల్సిన అవసరం లేకుండా పోయింది. అనుకున్న సమయానికి కోల్‌బెంచ్‌లను సిద్ధంగా ఉంచడంతో బొగ్గు ఉత్పత్తి నిరాటంకంగా సాగేందుకు అధికారులు ఏర్పాటు చేసుకున్న ప్రణాళికలు కలిసివచ్చాయి.

రెట్టింపు స్థాయిలో బొగ్గు రవాణా

ఏరియాలో ఈసారి రెట్టింపు స్థాయిలో బొగ్గు రవాణా చేసి అధికారులు కొత్త చరిత్ర సృష్టించారు. గతేడాది ఇదే సమయానికి 16,16,000 టన్నుల బొగ్గును రవాణా చేయగా ఈసారి ఇప్పటికే 31,15,972 టన్నుల బొగ్గు రవాణా చేశారు. గోలేటి సీహెచ్‌పీని సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు సకాలంలో వినియోగదారులకు బొగ్గును సరాఫరా చేయడంలో సఫలీకృతమయ్యారు.

ఉత్పత్తి గణనీయంగా పెరిగింది



బెల్లంపల్లి ఏరియాలో గతేడాదితో పోల్చితే 2023లో ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. ఏప్రిల్ 1 నుండి డిసెంబర్ ముగింపు వరకు ఏరియా 130 శాతం ఉత్పత్తితో ముందుకెళ్తోంది. బొగ్గు రవాణాలోనూ జోరు సాగిస్తున్నాం. గతేడాది కంటే ఈఏడాది డిసెంబర్ వరకు సుమారు 16 లక్షల టన్నుల బొగ్గును అదనంగా రవాణా చేయగలిగాం. ఓవరాల్‌గా ఈ ఏడాది ఏరియాకు అన్ని రకాలుగా అనుకూలంగా ఉంది.

– రవిప్రసాద్, జనరల్ మేనేజర్, బెల్లంపల్లి ఏరియా

నిరాశే మిగిల్చిన కొత్త గనుల ఏర్పాటు

ఏరియాకు పూర్వవైభవం తీసుకువచ్చే కొత్త గనుల ఏర్పాటు అవకాశాలు ఈ ఏడాదిలో నిరాశే మిగిల్చాయి. డిసెంబర్ నాటికే ఏరియాలో కొత్తగా గోలేటి ఓసీపీని ఏర్పాటు చేసి బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ ప్రారంభించాలని సింగరేణి సంస్థ భావించినా నిరాశే మిగిలింది. కొత్త ఓసీపీ ఏర్పాటుకు పూర్తి స్థాయిలో అనుమతులు రాకపోవటంతో వచ్చే ఏడాదికి వాయిదా పడినట్లయింది. డిసెంబర్ నాటికే అన్ని అనుమతులు వస్తాయని అధికారులు భావించినప్పటికీ రాకపోవడంతో కొత్త గనుల ఏర్పాటుకు బ్రేక్ పడినట్లయింది.

గుర్తింపు సంఘంగా 'ఏఐటీయూసీ'

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు ఇటీవలే పూర్తి కాగా పదేళ్ల తరువాత ఏఐటీయూసీ సింగరేణి గుర్తింపు సంఘంగా ఎన్నికైంది. ఎన్నికల్లో టీబీజీకేఎస్ పోటీ చేసినప్పటికీ చివరి నిమిషంలో యూనియన్ అధినాయకులు మూకుమ్మడి రాజీనామాలతో టీబీజీకేఎస్ ఏఐటీయూసీకి మద్దతు తెలిపింది.


కంపెనీ లెవల్ సాంస్కృతిక పోటీలు

బెల్లంపల్లి ఏరియా ఈ సంవత్సరం కంపెనీ లెవల్ సాంస్కృతిక పోటీలకు వేదికైంది. గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాలలో గత నెలలో రెండు రోజుల పాటు నిర్వహించిన పోటీల్లో సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల నుండి సుమారు 200 మంది కళాకారులు పాల్గొన్నారు. 40 అంశాలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

అభివృద్ధివైపు అడుగు..

- జిల్లా కేంద్రంలో కలెక్టరేట్, ఎస్పీ భవనాలు, మెడికల్ కళాశాల ప్రారంభం
- జిల్లా నుంచే పోడు పట్టాల పంపిణీ మరూ
- ఆసిఫాబాద్ మున్సిపాలిటీ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్
- కొనసాగుతున్న జాతీయ రహదారి పనులు

చూస్తుండగానే మరో ఏడాది కాలగర్భంలో కలిసిపోనుంది. అన్నిరంగాల్లో వెనుకబడిన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఏర్పాటై ఏడేళ్లు కావస్తుండగా ఇప్పుడిప్పుడే అభివృద్ధి వైపు అడుగులు పడుతున్నాయి. 2023లో చెప్పుకోదగ్గ స్థాయిలో జిల్లా ప్రజలకు ఎంతో కొంత మేలు జరిగింది. ఆదివాసీల చిరకాల కోరిక పోడు భూములకు పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ఈ ఏడాది జూన్ 30న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా నుంచే ప్రారంభించారు.



జిల్లా కేంద్రంలో కొత్తగా అందుబాటులోకి వచ్చిన సమీకృత కలెక్టరేట్ భవనం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో రూ.52.50 కోట్లతో నిర్మించిన సమీకృత కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయ భవన సముదాయాలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న పోడు రైతులకు సీఎం కేసీఆర్ చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేశారు. గతంలో ఇక్కడ పనిచేసిన కలెక్టర్ రాహుల్ రాజ్ బదిలీపై వెళ్లగా కొత్త కలెక్టర్‌గా హేమంత్ బోర్కడే బాధ్యతలు స్వీకరించారు. విశ్వవేదికపై ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలోని నాటు నాటు పాటకు ఆస్కార్ అవార్డు దక్కడంతో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు పదవులు కోల్పోగా ఆసిఫాబాద్ ఎమ్మెల్యేగా కోవ లక్ష్మి, సిర్పూర్ ఎమ్మెల్యేగా పాల్వాయి హరీశ్‌బాబు విజయం సాధించారు. ఎట్టకేలకు ఆసిఫాబాద్ గ్రామ పంచాయతీ నుండి రాజంపేట ఎస్టీ గ్రామ పంచాయతీ విడిపోయింది. పట్టణాభివృద్ధి కోసం అధికారులు 3,283 ఎకరాల్లో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. ఆసిఫాబాద్ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా గవర్నర్ ఆమోదించారు. ఈ క్రమంలో మున్సిపాలిటీకి గ్రీన్ సిగ్నల్ పడింది. జిల్లాలోని 101 గ్రామ పంచాయతీలకు ఒక్కో భవన నిర్మాణానికి రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. వీటితో పాటు ఐటీడీఏ ద్వారా మరో 52 గ్రామ పంచాయతీలకు ఒక్కో భవనానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయి. ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది జులైలో కురిసిన అకాల వర్షాలకు జిల్లాలో రూ.2.37 కోట్ల పంట నష్టం వాటిల్లింది.

కొరవడిన జవాబుదారీతనం

ప్రభుత్వ కార్యాలయాల్లో పూర్తిస్థాయి సిబ్బంది లేక పోవడంతో అరకొర సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. జిల్లా అధికారులుగా రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో ఇన్‌చార్జీలతో నెట్టుకొస్తున్నారు. అనర్హులకు పదవులు కట్టబెట్టడంతో ఆశించిన అభివృద్ధి కానరావడం లేదు. ధ్రువీకరణ పత్రాల కొరకు నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. వివిధ ప్రభుత్వ శాఖల్లో అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మూడేళ్లుగా కుంటుపడిన రియల్ ఎస్టేట్ కోలుకోవడం లేదు. ప్లాట్లు, భూముల అమ్మకాలు, కొనుగోళ్లు తగ్గిపోయాయి. విద్య, వైద్యం పురోగతి మెరుగుపడాల్సి ఉంది. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తయినప్పటికీ కాల్వల నిర్మాణం పూర్తి చేయక పోవడంతో రైతులకు సాగు నీరు అందని పరిస్థితి. కొమురంభీమ్, జగన్నాథ్‌పూర్ కాల్వల నిర్మాణాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. కొమురంభీమ్ ప్రాజెక్టు ఆనకట్టకు పగుళ్లుతేలి ప్రమాదం అంచుకు చేరినప్పటికీ మరమ్మతులు చేపట్టడం లేదు. గ్రామీణ ప్రాంతాలకు రహదారుల నిర్మాణం పూర్తి కాక పోవడంతో మారుమూల ఆదివాసీ గిరిజన గ్రామాలకు అంబులెన్స్ వెళ్లలేని పరిస్థితి. ఆసిఫాబాద్ మండలం గుండి, కెరమెరి మండలం అనార్‌పెల్లి వంతెనల నిర్మాణాలు పూర్తికాలేదు. కాగజ్‌నగర్ మండలం అందెవెల్లి బ్రిడ్జి కూలిపోవడంతో పెంచికల్‌పేట్, దహెగాం, బెజ్జూర్ ప్రాంత ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం పూర్తిస్థాయిలో పనిచేయక పోవడంతో జిల్లా కేంద్రంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. దీనిపై జెడ్పీ సమావేశంలో పలు మార్లు అధికారులను మందలించినా ఫలితం శూన్యం. జిల్లా కేంద్రంలో అసైన్డ్ భూములు అన్యాక్రాంతమవుతున్నప్పటికీ అధికారులు చోద్యం చూస్తున్నారు. జిల్లా కేంద్రంతో పాటు కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో అక్రమ వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. అవినీతి, అక్రమాల ఆరోపణలపై డీపీవో రమేశ్‌ను కలెక్టర్ హేమంత్‌బొర్కడే ప్రభుత్వానికి సరెండర్ చేశారు.

అందుబాటులోకి ఫోర్‌లైన్

రహదారుల విస్తరణలో భాగంగా రూ.1140.50 కోట్లతో నిర్మించిన ఫోర్‌లైన్ రహదారి రేపల్లెవాడ నుండి వాంకిడి మండలం మహారాష్ట్ర బార్డర్ వరకు 52.06 కిలోమీటర్ల మేర పనులు పూర్తికావడంతో రవాణా సౌకర్యం మెరుగుపడింది. జిల్లా కేంద్రంలో కొత్తగా ఏర్పాటైన టీహబ్‌లో 57 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నారు.

రాజీమార్గమే రాజమార్గము

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్

ఆసిఫాబాద్: రాజీమార్గమే రాజమార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కోర్టు భవన సముదాయంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులు రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లాలో క్రిమినల్, ఎక్సైజ్, సివిల్‌కు సంబంధించిన 4,086 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. దీని ద్వారా రూ.22,03,000 అవార్డు అమౌంట్, రూ.21,75,650 జరిమానా విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.యువరాజా, న్యాయవాదులు టి.సురేశ్, వెంకటేశ్వర్లు, జగన్మోహన్‌రావు, శ్యాం, తదితరులు పాల్గొన్నారు.

రాజీమార్గంతోనే కేసుల పరిష్కారం

సిర్పూర్(టి): కక్షిదారులు రాజీమార్గంతోనే కేసులు పరిష్కరించుకోవాలని జూనియర్ సివిల్ కోర్టు మేజిస్ట్రేట్ అజయ్ ఉల్లం అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. కార్యక్రమంలో కౌటాల సీఐ సాదిక్ పాషా, సిర్పూర్(టి) ఎస్సై డీకొండ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



కేసులు పరిశీలిస్తున్న న్యాయమూర్తి రమేశ్

క్లుప్తంగా

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

కాసిపేట: నిరుద్యోగ యువతకు ఎన్ఏసీ(న్యాక్), ఈజీఎంఎం–డీడీయూజీకేవై ఆధ్వర్యంలో మూడు నెలలపాటు ఉచిత శిక్షణ, ఉపాధి కల్పించనున్నట్లు ఆదిలాబాద్ న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగేంద్రన్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి ఎలక్ట్రికల్ అండ్ హౌస్ వైరింగ్, పదో తరగతి ఫెయిల్ లేక పాసైన వారికి ప్లంబింగ్ అండ్ సానిటేషన్ శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. 18ఏళ్ల నుంచి 35ఏళ్ల లోపు యువత అర్హులని, శిక్షణ కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి, బుక్స్, యూనిఫాం, షూస్, హెల్మెట్ అందజేస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, అర్హత సర్టిఫికెట్, కులధ్రువీకరణ పత్రం జిరాక్స్‌లు, ఐదు పాస్‌ఫొటోలతో ఐటీడీఏ, వైటీసీ బిల్డింగ్, తాళ్లగురిజాలరోడ్, సోషల్ వెల్ఫేర్ స్కూల్ బెల్లంపల్లి సమీపంలోని కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. వివరాలకు 8328507232, 9966110045 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

రన్నింగ్, లాంగ్‌జంప్ పోటీల్లో ప్రతిభ



పతకం అందుకుంటున్న పి.కృష్ణ

కాగజ్‌నగర్‌టౌన్: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో శనివారం నిర్వహించిన 200 మీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్ పోటీల్లో కాగజ్‌నగర్‌కు చెందిన పి.కృష్ణ ప్రతిభ కనబర్చి రెండు బంగారు పతకాలు, ఒక వెండి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా స్థానిక క్రీడాకారులు కృష్ణను అభినందించారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

సాక్షి ఎఫెక్ట్..

మందమర్రిరూరల్: సాక్షి దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన 'బొగ్గుచోరీ పేరిట.. జేసీబీ, లారీలు స్వాధీనం' అనే వార్తకు సింగరేణి అధికారులు స్పందించారు. శుక్రవారం సాయంత్రం రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్‌లో మందమర్రి ఏరియా జూనియర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ (ఎస్అండ్‌పీసీ) జేసీబీ, రెండు లారీల చోదకులపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

ధాన్యం కుప్ప దగ్ధం

కౌటాల: మండలంలోని గుండాయిపేట గ్రామానికి చెందిన రైతు ఎస్. సంతరాంకు చెందిన ధాన్యం కుప్ప విద్యుత్ ప్రమాదంలో శనివారం దగ్ధమైంది. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని ఎకరం పొలంలోని ధాన్యం కుప్పగా పోశాడు. ఈ క్రమంలో వరి గడ్డి సమీపంలోని విద్యుత్ తీగలపై పడడంతో మంటలు చెలరేగి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో ధాన్యంతో పాటు గడ్డి పూర్తిగా కాలిబూడిదైంది. ఈ ప్రమాదంలో సంతరాం చేతికి స్వల్ప గాయాలయ్యాయి. కేశార్ డ్రైవర్ అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో రూ.50వేల నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆదుకోవాలని సదరు రైతు వేడుకుంటున్నాడు.

వ్యాసరచన పోటీలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టంపై జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులు హాజరయ్యారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లా విద్యాశాఖ కో–ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, వినియోగదారుల ఫోరం ప్రతినిధులు, సీఆర్వో ఇండియా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి చేతన సోనీ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల 'వికాసం'

ఉట్నూర్‌రూరల్: సమాజంలోని ప్రతీఒక్కరిలో ఏదో ఒక సమాజ సేవ చేయాలనే ఆతృత ఇమిడి ఉంటుంది. సమాజ సేవ చేయడానికి ఒక్కొక్కరూ ఒక్కో విధంగా రాణిస్తుంటారు.. అదే మార్గంలో అప్పటి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సైతం ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన దివ్యాంగ విద్యార్థులకు విద్యను అందించాలనే ఉద్దేశంతో ఓ పాఠశాలను ఏర్పాటు చేశాడు. భోజనం, వసతి, విద్యను అందిస్తున్నారు. ఆ విద్యాసంస్థ పేరే.. వికాసం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగానే కాకుండా ఈ పాఠశాలలో పెద్దపల్లి, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల నుంచి కూడా దివ్యాంగ విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు.

- ప్రత్యేక సదుపాయాలతో వసతి
- చదువుల్లో రాణించేలా బోధన
- క్రీడల్లో రాష్ట్రస్థాయిలో రాణింపు
- అంధ విద్యార్థులకు ప్రత్యేక సౌకర్యాలు



ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని వికాసం పాఠశాల

పీవో కర్ణన్ ప్రత్యేక చొరవ...

ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల కేంద్రంలోని కుమురంభీం ప్రాంగణంలో అప్పటి ఐటీడీఏ పీవో ఆర్వీ కర్ణన్ ప్రత్యేక చొరవతో దివ్యాంగుల కోసం వికాసం పాఠశాలను ఏర్పాటు చేయించాడు. నాలుగు రకాల వైకల్యాలు కలిగిన మొత్తం 142మంది విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు. ఈ పాఠశాలను 2015 నవంబర్‌లో హైకోర్టు జడ్జి దిలీప్ జీ బోస్లే చేతుల మీదుగా ప్రారంభించారు.

వైకల్యం గల వారికి..

వికాసం ప్రత్యేక బాలల పాఠశాలలో ఒకటి నుంచి 8వ తరగతి వరకు చదువుకుంటున్నారు. ఇందులో బుద్ధి మాంద్యం గల విద్యార్థులు 37మంది. బధిరులు (చెవిటి, మూగ) 61, అంధులు 29, అంగవైకల్యం కలిగిన వారు 15 మంది ఇక్కడ విద్యను అభ్యసిస్తున్నారు.

పాఠశాల ప్రత్యేకత...

ఈ వికాసం పాఠశాలలో దివ్యాంగుల పిల్లల కోసం ప్రత్యేకంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆర్వీ కర్ణన్ ప్రత్యేక బాలల బడిని ఏర్పాటు చేయించారు. ఈ పాఠశాలలో ప్రత్యేకంగా దివ్యాంగులైన పిల్లల కోసం హాస్టల్ వసతి, ప్రత్యేకమైన ఉపాధ్యాయులతో బోధన, మంచి భోజనం, మినరల్ వాటర్, స్నాక్స్ అందిస్తున్నారు. పిల్లలకు ప్రతి నెల డాక్టర్లతో వైద్య పరీక్షలు చేయిస్తున్నారు. పాఠశాలలో పిల్లల కోసం ఆట స్థలం, ఆట వస్తువులు అందుబాటులో ఉంచారు. ఈ పాఠశాలలో మొదట 1వ తరగతి నుంచి 5 వరకు నిర్వహించారు. ప్రతీ ఏడాది ఓ తరగతిని పెంచుతూ ప్రస్తుతం 8వ తరగతి వరకు నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో అంధుల కోసం ప్రత్యేక డార్మెంటరీని ఏర్పాటు చేశారు. దీంతో అంధ విద్యార్థులు వారి పనులు వారే చేసుకుంటారు. అంధులు స్మార్ట్ కేన్ సాయంతో టాయిలెట్స్‌కి, తరగతి గదుల్లోకి వెళ్తుంటారు. వీరికి ప్రత్యేకంగా ర్యాంపులు సైతం ఏర్పాటు చేశారు.



దివ్యాంగ విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయులు

క్రీడల్లోనూ ప్రతిభ...

అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 13న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని మైదానంలో జరిగిన ఆటల పోటీల్లో రన్నింగ్, షాట్‌పుట్, చెస్, క్యారెం, జావిలింగ్‌త్రో పోటీల్లో అంధులు, మానసిక వికలాంగ విద్యార్థులు పాల్గొని 18 బహుమతులు గెలుపొందారు. 27న 6వ పారా అథ్లెటిక్ చాంపియన్‌షిప్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో ఆరుగురు విద్యార్థులు సత్తాచాటి బంగారు, సిల్వర్ పతకాలు సాధించారు. అలాగే సైన్స్‌ఫేర్ పోటీల్లో సైతం జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించారు.



క్రీడల్లో రాణించిన విద్యార్థులను అభినందిస్తున్న పీవో

ఇక్కడ చదువుకోవడం ఇష్టం..



వికాసం పాఠశాలలో ఉండి చదువుకోవడం అదృష్టంగా భావిస్తున్న. ఇక్కడ చదువుకోవాలంటే చాలా ఇష్టం.. సార్లు బాగ చూసుకోవడంతో పాటు తమకు అర్థమయ్యే రీతిలో మమ్మల్ని చదివిపిస్తున్నారు. అంతేకాకుండా తమ పనులు తాము చేసుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. ఎవరి తోడు లేకున్నా మా పనులు మేము చేసుకుంటాం.

– టి.హన్మంతు, 7వ తరగతి, అంధ విద్యార్థి సిర్పూర్(యు)

ఇంటికి కూడా వెళ్లం..



ఇంటి కంటే ఇక్కడే మంచిగా అనిపిస్తది. అందరితో కలిసి చదువుకోవడం అన్ని పనులు చేసుకోవడం బాగుంటుంది. సార్లు తమకు అర్థమయ్యే రీతిలో విద్యను బోధించడం, మంచి భోజనం అందించడం, ఆటలు, పాటలు నేర్పించడం సంతోషాన్ని కలిగిస్తుంది. నేను కూడా బాగా చదువుకొని మంచి స్థాయికి ఎదుగుతా..

– బి.రంజిత్, 8వ తరగతి, ఉట్నూర్ కొత్తగూడ

పిల్లలు ఇష్టంగా నేర్చుకుంటున్నారు..



పాఠశాలలో ఉన్న విద్యార్థులంతా అంగ వైకల్యం కలిగిన వారే. వారికి చదువంటే చాలా ఇష్టం.. తాము సైగల ద్వారా వారికి విద్యాబోధన చేస్తాం.. మొదట్లో కాస్త కష్టమైన వారికి అర్థమయ్యే రీతిలో విద్యను అందిస్తుండడంతో వారు ఇష్టంగా చదువుకుంటున్నారు. ఆటపాటలు నేర్చుకుంటున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో వీరికి విద్యను అందించడం అదృష్టంగా భావిస్తున్న.

– పావని, ఉపాధ్యాయురాలు

అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం



దివ్యాంగ విద్యార్థులు కావడంతో వారికి అన్నివసతులు, భోజన సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందిస్తున్నాం. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా పాఠశాల గురించి తెలుసుకున్న వారు ఇతర జిల్లాల నుంచి కూడా దివ్యాంగ విద్యార్థులను ఇక్కడ చేర్పిస్తున్నారు. చదువుతో పాటు జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల్లోనూ రాణిస్తున్నారు. అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తయింది.

– రాథోడ్ వికాస్, వికాసం పాఠశాల, ప్రధానోపాధ్యాయుడు

వివాదమైన షెడ్డు నిర్మాణం



పనులను అడ్డుకుంటున్న ఎస్అండ్‌పీసీ సిబ్బంది

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ డివిజ్ పరిధిలోని నస్పూర్ కాలనీలోని కంపెనీ క్వార్టర్ ఎదుట కార్మికుడు నిర్మించుకుంటున్న షెడ్డు వివాదస్పదమైంది. ఓ కార్మికుడు క్వార్టర్‌లో స్థలం సరిపోకపోవడంతో అందరి వలే ఇంటి ముందు షెడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో శనివారం సెక్యూరిటీ సిబ్బంది వచ్చి పనులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సదరు కార్మికుని కుటుంబానికి సెక్యూరిటీ సిబ్బందికి మధ్యవాగ్వాదం చోటుచేసుకుంది. అనుమతి లేకుండా ఎలా కడుతారంటూ కార్మికుని కుటుంబాన్ని సెక్యూరిటీ సిబ్బంది ప్రశ్నించి అప్పటి వరకు కట్టిన గోడను కూల్చివేశారు. అనుమతి కోసం తాము అధికారులను కలిశామని కుటుంబం పేర్కొనగా అనుమతి వచ్చేంత వరకు కట్టేది లేదని కొంత నిర్మాణాన్ని కూల్చివేశారు. ఇంటి వారు ఎంత వారించిన కూడా వారు వినిపించుకోకుండా గోడలను కూల్చివేశారు. దీనిపై కార్మికుడి కుటుంబ సభ్యులు, ఇరుగు పొరుగు వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీలోని వందలకొద్ది షెడ్లు కట్టుకున్నారని వీటన్నింటికి అనుమతులు ఉన్నాయా అని ప్రశ్నించారు. దీన్ని హెచ్ఎమ్మెస్ నాయకులు సోషల్ మీడియాలో పెట్టడంతో చర్చనీయాంశంగా మారింది. సెక్యూరిటీ అధికారుల తీరును హెచ్ఎమ్మెస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తీవ్రంగా ఖండించారు. కంపెనీ అధికారులు ఇలాంటి చేష్టలు మానుకోవాలన్నారు.

ఆదివాసీ రైతు అదృశ్యం



రాంచందర్

కెరమెరి: మండలంలోని మెట్టపిప్రి గ్రామానికి చెందిన మడావి రాంచందర్(35) అదృశ్యమయ్యాడు. ఐదు రోజుల నుంచి కనిపించకోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. కుటుంబీకుల వివరాల ప్రకారం... సోమవారం రాత్రి పొలంలో ఉన్న కంది పంటను పందులు, కోతుల బారినుంచి రక్షణ కోసం అడవికి వెళ్లాడు. మంగళవారం మధ్యాహ్నం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబీకులు అడవులు, నదులు అన్ని కలియ తిరిగినప్పటికీ ఆచూకీ లభించలేదని తండ్రి గోవింద్‌రావు తెలిపారు.

పాఠశాలను సందర్శించిన సెక్టోరల్ అధికారులు

కోటపల్లి: మండల కేంద్రంతో పాటు సర్వాయిపేట గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, ప్రాథమిక పాఠశాలను శనివారం జిల్లా సెక్టోరల్ అధికారులు చౌదరి, సత్యనారాయణ మూర్తిలు సందర్శించారు. ఇందులో భాగంగా తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాల అమలుతీరును, తరగతి గది బోధన తీరును పరిశీలించారు. సీఆర్పీలు, ఐఈఆర్పీలు చేస్తున్నటువంటి బడి బయటి పిల్లల సర్వేను పరిశీలించారు. జెడ్పీఎస్ఎస్ కోటపల్లి పాఠశాలలో వంద శాతం హాజరు కలిగిన విద్యార్థులను సన్మానించి బహుమతులు అందజేశారు. వారి వెంట కృష్ణమూర్తి, హెచ్ఎం నాగేందర్, సీఆర్పీ సంపత్, ఐఈఆర్పి కృష్ణవేణి, ఉపాధ్యాయులు ఉన్నారు.



విద్యార్థిని సన్మానిస్తున్న అధికారులు

చికిత్స పొందుతూ యువకుడి మృతి

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన ఆకుదారి సంపత్(25) చికిత్స పొందుతూ మృతి చెందాడు. చెన్నూర్ పట్టణ సీఐ వాసుదేవరావు తెలిపిన వివరాల ప్రకారం.... ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన ఆకుదారి సంపత్ ఈ నెల 26వ తేదీన రాత్రి అదే గ్రామంలోని కిరాణ షాపుకు కోడిగుడ్లు కొనేందుకు వెళ్లాడు. అదే గ్రామానికి చెందిన వీరబోయిన సతీశ్, పంది మహేశ్, అలుగునూరి అరుణ్ అనే వ్యక్తులు షాపు వద్దే ఉన్నారు. వాళ్లు సంపత్‌తో మాట్లాడుతుండగా సతీష్ సంపత్‌ను అవురా అని అన్నాడు. కులం తక్కువ వాడివి అలా అంటావా అని సతీష్, మహేష్, అరుణ్ సంపత్‌ను కడుపుపై గుద్దారు. దీంతో ఇంటికి వెళ్లిన సంపత్‌కు నొప్పి ఎక్కువ కావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే మళ్లీ సంపత్‌కు శుక్రవారం రాత్రి నొప్పి ఎక్కువ కావడంతో చెన్నూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మంచిర్యాలకు రెఫర్ చేశారు. మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జైపూర్ ఏసీపీ మోహన్ పరిశీలించారు. మృతుడి తండ్రి పోచయ్య ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నతుట్ల సీఐ వివరించారు.



సంపత్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న జైపూర్ ఏసీపీ

గోదావరి రైస్ స్టోర్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్

మంచిర్యాలఅగ్రికల్చర్: గోదావరి ఎఫ్‌పీవో రైస్‌స్టోర్స్‌లో నాణ్యమైన జైశ్రీరామ వడ్లను రైతుల నుంచి సేకరించి ఎక్కువ పాలిష్ లేకుండా ధాన్యాన్ని మిల్లింగ్ చేసి కల్తీ లేకుండా తక్కువ ధరకు బియ్యం అందించడం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో శనివారం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన గోదావరి ఎఫ్‌పివో రైస్‌స్టోర్‌ను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి. శేషాద్రి, జెడ్పీసీవో నరేందర్ ప్రారంభించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మహిళా సంఘాలతో భీమారం, జైపూర్ మండలాల్లో గోదావరి రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేసిన రైతుల నుంచి నాణ్యమైన జైశ్రీరామ వడ్లను సేకరించడం జరిగిందని తెలిపారు. ఈ ధాన్యం ఎక్కువ పాలిష్, కల్తీ లేకుండా గోదావరి రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యుల పర్యవేక్షణలో మిల్లింగ్ చేయడం జరిగిందని, క్వింటాల్‌కు రూ. 5,800 ధరతో ఎలాంటి లాభాపేక్ష లేకుండా విక్రయ కేంద్రం విక్రయించేందుకు నిర్ణయించడం జరిగిందన్నారు. విక్రయ కేంద్రం నుంచి ఇతర ప్రాంతాలకు సరఫరా చేయడానికి అదనపు రవాణా చార్జీలతో సౌకర్యం కల్పించడం జరిగిందని, బియ్యం కావాల్సిన వారు 9652004886, 7337488828, 9121103856 నంబర్లలో సంప్రదించవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సంబంధిత అధికారులు, నిర్వాహకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బి. రాహుల్

అన్ని రంగాల్లో ఆర్కే 6 గని ముందంజ

- ఉత్పత్తిలో 110 శాతం
- గని మేనేజర్ తిరుపతి

శ్రీరాంపూర్: అన్ని రంగాల్లో ఆర్కే–6 గని ముందంజలో ఉందని ఆ గని మేనేజర్ తిరుపతి తెలిపారు. శనివారం గనిపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో 2023లో సాధించిన విజయాలను వివరించారు. ఇప్పటి వరకు గనికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యం 1,46,493 టన్నులకు 1,80,000 సాధించి 110 శాతం లక్ష్యాన్ని పూర్తి చేసిందన్నారు. భూగర్భ గనుల్లో అధిక ఉత్పత్తిని సాధించిన గనుల్లో ఆర్కే 6 గని ప్రత్యేక స్థానం సాధించిందన్నారు. 2022 రక్షణ వారోత్సవాల్లో భాగంగా రక్షణ చర్యల్లో గనికి కంపెనీ వ్యాప్తంగా ప్రథమ స్థానం లభించిందన్నారు. అంతే కాకుండా ఎస్‌డీఎల్ పరంగా ఉత్పత్తిలో కూడా కంపెనీలో గని ప్రథమ స్థానంలో నిలిచి బహుమతులు తీసుకుందన్నారు. సెంట్రల్ కోల్ మినిస్ట్రీ వారు గనుల్లో ఉత్పత్తి, రక్షణ, కార్మికుల సంక్షేమ కార్యక్రమాలు అన్నింటిని పరిశీలించి తమ గనికి ఫోర్ స్టార్ రేటింగ్ ఇచ్చారని, ఇది తమకెంతో గర్వకారణం అన్నారు. దీనితో పాటు ఇటీవల జరిగిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో తమ గని రక్షణాధికారి కాదాసి శ్రీనివాస్ ఉత్తమ అధికారిగా, ఉత్తమ ఉద్యోగిగా రాంరెడ్డి ఎంపికై బహుమతులు పొందారన్నారు. ఈ రికార్డులన్ని ఉద్యోగులు, సూపర్‌వైజర్లు, అధికారులు సమిష్టి కృషి చేయడంతోనే సాధ్యమైందన్నారు. గనిలో బొగ్గు ఉత్పత్తితో పాటు రక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని తెలిపారు. ఏరియా జీఎం బీ సంజీవరెడ్డి, ఏజెంట్, ఇతర అధికారుల సహాయ సహకారాలతో ఈ విజయాలను నమోదు చేసుకున్నామన్నారు. గని రక్షణాధికారి కాదాసి శ్రీనివాస్, డెప్యూటీ మేనేజర్ యస్ కొమురయ్య, ఇంజనీర్ శ్యాంకుమార్, సెక్షన్ ఇంజనీర్ మహేశ్, సర్వే అధికారి వర్మ ఉన్నారు.



మాట్లాడుతున్న ఈ తిరుపతి

జాతీయస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనాథ్ తెలిపారు. శనివారం పాఠశాల ఆవరణలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18న మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో నిర్వహించిన అండర్–17 రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో విద్యార్థులు రాకేష్, సన్ని ఉత్తమ ప్రతిభ కనబర్చారు. జనవరి 2 నుంచి 5 వరకు ఛత్తీస్‌గఢ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో పీడీ యాదగిరి, పీఈటీ నరేందర్, సంపత్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

గంజాయి పట్టివేత

వాంకిడి: కెరమెరి మండలంలోని బారె మోడి గ్రామానికి చెందిన మొహర్లే బడిరాం ఇంటి ఆవరణలో ఈ నెల 29న తనిఖీలు నిర్వహించి రూ.10వేల విలువైన 1.320 కిలోల పచ్చి గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ని ర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి మొక్కను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. గంజాయి సాగు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. కెరమెరి ఎస్సై విజేయ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఈజ్‌గాం రోడ్డు (ఆర్ఆర్‌ఓ కాలనీ) వద్ద గల పెట్రోల్‌పంపు సమీపంలో పోలీసులు తనిఖీలు నిర్వహించి గంజాయిని పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే... పట్టణ సీఐ బుద్దే స్వామి, ఎస్సై ఎంబడి శ్రీకాంత్‌లు పెట్రోలింగ్‌లో భాగంగా ఆర్ఆర్‌ఓ కాలనీ వైపు వస్తుండగా ద్విచక్ర వాహనంపై కూర్చొని ఓ యువకుడు అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని తనిఖీ చేయగా ఓ ప్యాకెట్‌లో 40 గ్రాముల గంజాయి లభ్యమైంది. పట్టుబడిన యువకుడు కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం బెంగాలీ క్యాంపు–3కు చెందిన మిథున్‌గా గుర్తించారు. కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



రోహిత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సైదులు

బెల్లంపల్లి: తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బెల్లంపల్లి బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీఓఈ) పాఠశాల విద్యార్థి జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 18న మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు నిర్వహించగా సీఓఈ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వేల్పుల రోహిత్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు తరఫున ఆడి ప్రతిభ కనబర్చాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు కాంస్య పతకం సాధించడానికి రోహిత్ తోడ్పడ్డాడు. ఈ మేరకు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనేందుకు రోహిత్‌ను ఎంపిక చేశారు. జనవరి 2 నుంచి 5వ తేదీ వరకు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం బాలాస్‌పూర్‌లో జరగనున్న జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున రోహిత్ ఆడనున్నట్లు సీఓఈ కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు తెలిపారు. ఈ సందర్భంగా రోహిత్‌ను శనివారం ప్రిన్సిపాల్, పీఈటీలు అభినందించారు. ఇందులో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా సెక్రెటరీ పరిమళ, వైస్ ప్రిన్సిపాల్ కోట రాజ్‌కుమార్, జేవీపీ కె.రాజేశ్వర్, పీడీ అల్లూరి వామన్, పీఈటీ నడిగొట్టి రాకేష్, ఉపాధ్యాయులు దత్తప్రసాద్ ఉన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం

- ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు..

దండేపల్లి: ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా దండేపల్లిలో శనివారం నిర్వహించిన దరఖాస్తుల స్వీకరణలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అధికారం చేపట్టిన వారం రోజుల నుంచే హామీల అమలులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మరో ఐదు గ్యారంటీలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని చెప్పారు. జెడ్పీసీవో నరేందర్, డీపీవో వెంకటేశ్వర్లు, మండల ప్రత్యేకాధికారి స్వామిరెడ్డి, ఎంపీపీ శ్రీనివాస్, జెడ్పీటీసీ నాగరాణి, ఎంపీడీవో మల్లేశం, సర్పంచ్ చంద్రకళ, ఎంపీటీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.



దండేపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

అధికారుల అత్యుత్సాహం..

దరఖాస్తుల స్వీకరణలో అధికారులు అత్యుత్సాహంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఎమ్మెల్యే వచ్చే వరకు దరఖాస్తులు తీసుకోవద్దని మండలస్థాయి అధికారుల చెప్పారు. దరఖాస్తులు ఇచ్చేందుకు మధ్యాహ్నం వచ్చిన ప్రజలు సాయంత్రం 6గంటల వరకు వేచి ఉన్నారు.

డైరెక్టర్‌కు ఐఎన్‌టీయూసీ వినతి

శ్రీరాంపూర్: సింగరేణి వ్యాప్తంగా పెండింగ్‌లోని పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ బీ జనక్ ప్రసాద్ యాజమాన్యం కోరారు. ఈ మేరకు శనివారం ఆయన హైదరాబాద్‌లోని సింగరేణి హెడ్ ఆఫీస్‌లో కంపెనీ డైరెక్టర్ (ఫైనాన్స్, పా) యన్ బలరాంను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం డైరెక్టర్ (ఆపరేషన్) యన్‌వీకే శ్రీనివాస్‌ను కూడా కలిసి ఆయన దృష్టికి కూడా పలు సమస్యలను తీసుకెళ్లారు. రామగుండం రీజియన్‌లోని మూడు ఏరియాలతో పాటు శ్రీరాంపూర్ ఏరియాలో కార్మికులకు సురక్షిత మంచినీటిని సరఫరా చేయాలన్నారు. రాపిడ్ గ్రావిటీ సిస్టం ద్వారా తాగునీరు అందించాలని కోరారు. దీని కోసం గతంలో తాము చేసిన పోరాటం ఫలితంగా కంపెనీ రూ.20కోట్లు మంజూరు చేసిందని, కానీ ఇప్పటికీ టెండర్ ప్రక్రియ పూర్తి కాకపోవడం వలన కార్మికులు అపరిశుభ్ర నీరే తాగాల్సి వస్తుందన్నారు. వెంటనే టెండర్లు పిలిచి తాగునీటిని అందించాలని కోరారు. మెడికల్ బోర్డులో జరిగే అవినీతిని పూర్తి అరికట్టాలని, పారదర్శకంగా మెడికల్ బోర్డును నిర్వహించాలని కోరారు. ఆ యూనియన్ సెంట్రల్ క్యాంపెనింగ్ ఇన్‌చార్జి వికాస్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న జనక్‌ప్రసాద్